

కొన్నిసార్లు మూత్రంలో నురగ సాధారణ విషయమే. అయితే, తరచుగా వస్తుంటే మాత్రం దాన్ని ఆరోగ్య సమస్య సంకేతంగా భావించాలి. మూత్రం రంగులో మార్పు, మంట, నురగ వంటివి ఎన్నో రోగాలకు సంకేతాలు. వీటిని నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.


# మూత్రంలో నురగా!

**కారణాలు**

**ప్రొటీన్లు అధికంగా:** కిడ్నీల్లో సమస్యల కారణంగా మూత్రంలో ప్రొటీన్లు కలిసిపోతాయి. దీంతో మూత్రం నురగగా వస్తుంది.

**కిడ్నీ సమస్యలు:** కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు కూడా మూత్రంలో నురగ వస్తుంది.

**డయాబెటిస్:** మధుమేహ రోగుల్లో రక్తంలో చక్కెర స్థాయులు అధికంగా ఉండటం కూడా మూత్రంలో నురగకు కారణం. రక్తంలో చక్కెర స్థాయులు పెరిగినప్పుడు మూత్రంలో నురగ ఏర్పడుతుంది.



**మూత్రనాళ ఇన్ఫెక్షన్ (యూటీఐ),** ప్రొస్టేట్ సమస్యలు కూడా మూత్రంలో నురగకు దారితీస్తాయి.

**పరీక్షలు**

**మూత్ర పరీక్ష:** మూత్రంలో ప్రొటీన్లు, గ్లూకోజ్, ఇతర మూలకాలు ఉంటే ఈ పరీక్ష అవసరమవుతుంది.

**రక్త పరీక్ష:** కిడ్నీ పనితీరు గురించి తెలుసుకోవడానికి అవసరం.

**మైక్రో ఆల్బుమిన్ పరీక్ష:** మూత్రంలో ప్రొటీన్ల పరిమాణాన్ని తెలుసుకోవడానికి చేస్తారు.

**అల్ట్రాసౌండ్ పరీక్ష:** కిడ్నీలు, మూత్రనాళ స్థితిగతులను పరీక్షించడానికి దీన్ని చేస్తారు.

**డాక్టర్ దగ్గరికి ఎప్పుడు?**

మూత్రంలో నురగ తరచుగా వస్తూ... మూత్రం గాఢమైన పసుపురంగులో, ఎర్రగా, అసాధారణంగా అనిపిస్తే డాక్టర్‌ను కలవాలి. మూత్ర విసర్జన సమయంలో మంటగా, నొప్పిగా, లేదంటే కిడ్నీల్లో అసౌకర్యంగా అనిపించినా, శరీరంలో వాపు కనిపించినా డాక్టర్‌ను కలవాలి.

# అధిక రక్తపోటుకు ఆయుర్వేదం



**ఆధునిక** జీవనశైలి సమస్యల్లో బీపీ (అధిక రక్తపోటు) ప్రధానమైంది. బీపీని అదుపులో ఉంచుకోవడానికి ఆయుర్వేదం కొన్ని పరిష్కారాలను సూచిస్తున్నది. వీటిని రోజూ అనుసరిస్తూ, కొన్ని ప్రత్యేకమైన శ్వాస పద్ధతులను సాధన చేయాలి. ఇవి అధిక రక్తపోటును తగ్గించడంలో దోహదపడతాయి. ఆయుర్వేదం రక్తపోటు సమస్యకు వెంటనే పరిష్కారం చూపించదు కానీ, దీర్ఘకాలికంగా పని చేస్తుంది. ఆరోగ్యం విషయంలో ఏ మార్పయినా సరే వైద్యుల సలహా మేరకే చేసుకోవాలి.

**వెల్లుల్లి కషాయం**

ఆయుర్వేదంలో వెల్లుల్లిని రక్తాన్ని పలుచన చేసేదిగా పరిగణిస్తారు. వెల్లుల్లిలో ఎలిసిన్ అనే మూలకం ఉంటుంది. ఇది రక్తనాళాలను వ్యాకోచింప చేస్తుంది. తద్వారా రక్త సరఫరా మెరుగుపడుతుంది. పొద్దునే పరగడుపున దంచిన వెల్లుల్లి రెమ్మను వేడినీటితో కలుపుకొని తాగాలి. ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది.

**నానబెట్టిన ఎండుద్రాక్షలు**

ఎనిమిది నుంచి పది ఎండుద్రాక్షలను రాత్రంతా నానబెట్టాలి. వాటిని పొద్దునే పరగడుపున తినేయాలి. ఎండుద్రాక్షలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో అధిక రక్తపోటుకు ప్రధాన కారణమైన సోడియం స్థాయులను తగ్గించడంలో తోడ్పడుతుంది.

**నూనెతో మర్దనా**

శరీరాన్ని గోరువెచ్చటి నూనెతో మర్దనా చేయడం కూడా ఒత్తిడిని తగ్గిస్తుంది. నాడీ వ్యవస్థకు ఉపశమనం కలిగిస్తుంది. రక్తపోటు నియంత్రణకు ఈ రెండే కీలకంగా వ్యవహరిస్తాయి. నువ్వుల నూనె, బాదం నూనె, బ్రాహ్మీ నూనె రక్త ప్రవాహాన్ని మెరుగుపరిచి, అధిక రక్తపోటును తగ్గిస్తాయి.

**ఎలా చేయాలి?**

కొద్ది మోతాదులో నూనె తీసుకుని తల, మెడ, పాదాలకు పట్టించాలి. ఓ అరగంటపాటు అలా వదిలేయాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి.

**తులసి నిమ్మ నీరు**

గోరువెచ్చటి నీటిలో తులసి, నిమ్మరసం కలుపుకొని తాగాలి. గుండె ఆరోగ్యానికి ఆయుర్వేదం చెప్పే రహస్యం ఇదే. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు, ఒత్తిడిని తగ్గించే గుణాలు ఉంటాయి. ఇక నిమ్మరసం శరీరంలో పేరుకుపోయిన అధిక సోడియంను బయటికి పంపించేస్తుంది.

**ఎలా చేయాలి?**

ఐదారు తులసి ఆకులను గోరువెచ్చటి నీటిలో వేసుకోవాలి. సగం నిమ్మచెక్కను ఆ నీళ్లలో పిండేయాలి. ఈ నీటిని పరగడుపునే తాగేయాలి.

**ప్రాణాయామం**



మనసు విశ్రాంతి కోసం, రక్తపోటు సమతూకంలో ఉండటానికి ఆయుర్వేదం ప్రాణాయామాన్ని సూచిస్తుంది. ఇందులో రెండు శక్తిమంతమైన పద్ధతులు ఉన్నాయి.

**శీతలి ప్రాణాయామం:** నాడీ వ్యవస్థకు ఉపశమనం కలిగిస్తుంది. బీపీని వెంటనే తగ్గిస్తుంది.

**అనులోమ విలోమం:** ఈ రకం ప్రాణాయామం శరీరంలో ఆక్సిజన్ స్థాయులను సమతూకంలో ఉంచుతుంది. అధిక రక్తపోటు కారణంగా తలెత్తే ఒత్తిడిని తగ్గిస్తుంది.

**ఇదీ దినచర్య!**

ఆయుర్వేదం ప్రకారం అనారోగ్యకరమైన రోజువారీ అలవాట్లు శరీర ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అధిక రక్తపోటుకు దారితీస్తాయి. కాబట్టి, బీపీ స్థాయులు అదుపులో ఉండాలంటే దినచర్య సవ్యంగా ఉండాల్సిందే.


- సూర్యోదయానికి ముందే నిద్ర లేవాలి. లేత ఎండలో కాసేపు గడపాలి. రక్త ప్రవాహం సాఫీగా సాగిపోవడానికి ఇది మేలుచేస్తుంది.
- నిర్దిష్ట సమయాల్లోనే తినేయాలి. ఉపాహారం వాయిదా వేయొద్దు.
- డిజిటల్ తెరలకు ఎక్కువగా అతుక్కుపోవద్దు. రాత్రి నిద్రకు ముందు అతిభోజనం వద్దు.
- రాత్రి పదిలోగా పడుకోవడం మంచిది.

# చెప్పింది చేయడు.. చెప్పినా వినడు

పిల్లల పెంపకం


**మా పిల్లవాడి వయసు ఏడు సంవత్సరాలు. బాగా అల్లరి చేస్తాడు. బడి నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి. పలుమార్లు దెబ్బలు తగిలించుకుంటాడు. ఎంత చెప్పినా అర్థం చేసుకోడు. కొన్ని సందర్భాల్లో చేయిచేసుకుంటే కానీ ఆగడు. ఏం చేయాలో సలహా ఇవ్వండి.**

**పిల్లలు** అంటేనే అల్లరి. మీరు చెప్పేదాన్ని బట్టి మీ పిల్లవాడు చేసే అల్లరి అదుపు తప్పిందనిపిస్తున్నది. మీ మాటల ఆధారంగా అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) లక్షణాలు కొంచెం కనిపిస్తున్నాయి. ఈ రుగ్మత ఉన్న పిల్లలు నిలకడగా పనిచేయరు. ఒక పని కొంచెం చేయగానే మరో పని చేయాలనుకుంటారు. దేని మీదా ఏకాగ్రత ఉండదు. ఇంపల్సిటివిటీ (హఠాత్తుగా చేయడం), హైపర్ యాక్టివిటీ (అధిక చురుకుదనం), ఇన్‌అటెంటివ్‌నెస్ (అజాగ్రత్తగా ఉండడం) ఏడీహెచ్‌డీ ప్రధాన లక్షణాలు. ఏడీహెచ్‌డీ ఉంటే తరగతి గదిలో ఇతరులకు అసౌకర్యం కలిగిస్తారు. దాంతో టీచర్లకు కూడా ఇబ్బందిగానే ఉంటుంది. ఈ లక్షణాలు తీవ్రస్థాయిలో ఉన్నాయా? అవి ఏడీహెచ్‌డీ లక్షణాలకు అనుగుణంగా ఉన్నాయా తేల్చాలంటే మొదటగా పిల్లల వైద్యులకు చూపించాలి. ఏడీహెచ్‌డీ నిర్ధారించడానికి కొన్ని ప్రమాణాలు పాటిస్తారు. కొన్ని లక్షణాలు ఉన్నంత మాత్రాన ఏడీహెచ్‌డీ ఉన్నట్టు కాదు. డిస్లెక్సియా (నేర్చుకోవడంలో ఇబ్బంది), థైరాయిడ్, మరికొన్ని రకాల వ్యాధులు ఉన్నవారికి కూడా ఈ లక్షణాలు ఉంటాయి. కాబట్టి మీ అబ్బాయి సమస్య ఏడీహెచ్‌డీ వల్లనా, మరేదైనా అయ్యుంటుందా? అనేది మొదటగా నిర్ధారించాలి. దీనికంటే ముందుగా మీ పిల్లవాడిని సురక్షితమైన ప్రదేశంలోనే ఉంచాలి. వాళ్ల చర్యల వల్ల గాయపడే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ఇతర పిల్లలతో తీవ్రంగా గొడవపడతారు. గాయపరుస్తారు. కాబట్టి టీచర్లకు, తోటి విద్యార్థులకు కూడా విషయాన్ని అర్థమయ్యేలా ముందే చెప్పాలి. డాక్టర్ చెప్పిన పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ, సరైన వైద్యం చేయిస్తే ఏడీహెచ్‌డీని అదుపు చేయవచ్చు.






**డాక్టర్ విజయానంద్**
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్



గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో గుబులు పుట్టిస్తున్న వ్యాధి. లక్ష మందిలో నలుగురు ఐదుగురికి వచ్చే అవకాశం ఉన్న అరుదైన వ్యాధి జీబీఎస్. అయితే, ఇది గతంలోని మాట. ఒకప్పుడు చాలా అరుదుగా కనిపించే ఈ వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారినీ ఇది కుదిపేస్తున్నది. రోగి చూడ్డానికి ఆరోగ్యంగానే కనిపిస్తాడు. వైద్య పరీక్షల్లో వైటల్స్ నర్వ్, బీపీ తదితరాలు అన్నీ సాధారణంగానే ఉంటాయి. అయినప్పటికీ రోగి చాలా బలహీనంగా, అశక్తుడిగా మారతాడు. కాళ్లూ, చేతులు, మెడ కండరాలతోపాటు... ఒక్కోసారి తలలోని కండరాలూ అచేతనంగా మారడంతో కళ్లు కూడా మూసుకోలేని స్థితికి చేరుకుంటాడు.

# గుబులు పుట్టిస్తున్న జీబీఎస్

**జీబీఎస్** పాత రోగమే. పైగా ఇది అంటువ్యాధి కూడా కాదు. ఒకరి నుంచి ఇంకొకరికి సోకే అవకాశం ఏమాత్రం లేదు. ఇది నాడులకు సంబంధించిన ఆటో ఇమ్యూన్ వ్యాధి. ఇందులో 4 వేరియంట్లు ఉంటాయి. అవి... 1. ఏఐడీపీ, 2. ఏఎంఏఎన్, 3. ఏఎంఎస్ఏఎన్, 4. ఎంఎఫ్ఎస్. అయితే, వీటిలో కూడా ఏఐడీపీ వేరియంట్ మాత్రమే ఎక్కువమందిలో కనిపిస్తున్నది. ప్రస్తుతం దేశంలో నమోదవుతున్న కేసుల్లో కూడా ఈ వేరియంటే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం జీబీఎస్ రోగుల్లో దేశవ్యాప్తంగా రెండు మూడు మరణాలు కూడా సంభవించడంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తున్న గులియన్ బారే సింగ్రోమ్ (జీబీఎస్) రావడానికి గల కారణాలేంటి? వ్యాధిని ఎలా గుర్తించాలి? అందుబాటులో ఉన్న చికిత్స పద్ధతులేంటి? తదితర అంశాల గురించి అవలోకనం చేసుకుందాం.



**1. ఏఐడీపీ (ఎక్యూట్ ఇన్‌ఫ్లమెటరీ డీమైలినేటింగ్ పాలిన్యూరోపతి)**

ఈ వేరియంట్ సాధారణంగా ఎక్కువమందిలో కనిపిస్తున్నది. దీనివల్ల కండరాలు చచ్చుబడిపోతాయి. శరీరంలో ఉన్న ఇమ్యూన్ మెకానిజం దెబ్బతిని ఇన్‌ఫ్లమేషన్ వస్తుంది. దీంతో నాడీకణాలకు తొడుగులా ఉండే మైలిన్ పొర దెబ్బతింటుంది. మైలిన్ పొర విద్యుత్ ప్రచోదనాలను ఒక నాడి నుంచి మరో నాడికి చేరవేస్తుంది. ఇన్‌ఫ్లమేషన్ వల్ల ఈ మైలిన్ పొర దెబ్బతింటుంది. 'కాంపైలోబ్యాక్టర్' అనే బ్యాక్టీరియా గ్యాస్ట్రో ఎంటరైటిస్‌కు కారణమవుతుంది. చాలామంది జీబీఎస్ బాధితుల్లో 'కాంపైలోబ్యాక్టర్' ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. కాకపోతే, ఈ బ్యాక్టీరియా వల్లనే జీబీఎస్ వస్తుందనేది మాత్రం ఎక్కడా రుజువు కాలేదు.

**2. ఏఎంఏఎన్ (ఎక్యూట్ మోటార్ యాగ్జోనల్ న్యూరోపతి– అమాన్)**

ఇది కూడా ఎవరిలోనైనా రావచ్చు. దీనికి కూడా ప్రత్యేక కారణం లేదు.

**3. ఏఎంఎస్ఏఎన్ (ఎక్యూట్ మోటార్ సెన్సరీ యాగ్జోనల్ న్యూరోపతి)**

ఇందులో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రోగి కోలుకునే (రికవరీ రేటు) అవకాశం తక్కువగా ఉంటుంది. విపరీతమైన నొప్పి ఉంటుంది. కొంతమందిలో మూత్ర విసర్జన నిలిచిపోతుంది. మలబద్ధకం ఏర్పడుతుంది. గుండె కొట్టుకునే వేగం కూడా పెరుగుతుంది. ఇది అందరిలో ఉంటుంది. శ్వాస, పల్స్ రేట్‌లో కూడా మార్పులు కనిపిస్తాయి. ముఖ్యంగా ఈ వేరియంట్‌లో రోగి ఊపిరితిత్తుల్లోని నాడులు పక్షవాతానికి గురై, శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. ఫలితంగా రోగి మరణించే ప్రమాదం పొంచి ఉంటుంది.

**4. ఎంఎఫ్ఎస్ (మిల్లర్ ఫిషర్ సింగ్రోమ్)**

ఈ వేరియంట్‌లో కంటిచూపు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ వేరియంట్‌కు గురైన రోగులు తూలుతూ నడుస్తారు. కంటిలో కండరాలు కూడా ఆఫ్తాల్మో ప్లీజియాకు గురవుతాయి. దీనివల్ల బొమ్మ రెండుగా కనిపిస్తుంది. కనుగుడ్డు కదలదు. ఇవన్నీ చాలా అరుదు.

**వీరిలో ఎక్కువగా...**

జీబీఎస్ రావడానికి కచ్చితమైన కారణాలంటూ ఏమీ లేవు. ఈ రుగ్మత పుట్టిన 3 నెలల వయసు నుంచి ఇతర అన్ని వయసుల వారికీ వస్తుంది. కానీ, ఎక్కువగా 30– 45 ఏండ్ల మధ్య, 50 – 65 ఏండ్ల మధ్య వయసు వారిలో జీబీఎస్ ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఎక్కువ శాతం వరకు డయేరియా, శ్వాస సంబంధ ఇన్ఫెక్షన్లు వచ్చిపోయిన రెండు నుంచి నాలుగు వారాల తర్వాత జీబీఎస్ బాధించే అవకాశాలు ఎక్కువ. స్త్రీలతో పోలిస్తే పురుషుల్లో ఈ సమస్య కొంత ఎక్కువగా కనిపిస్తుంది. పురుషులు బయట తిరగడం, ఇన్ఫెక్షన్లకు గురవడం వంటివి కారణాలుగా కనిపిస్తాయి.

**రుతువు మార్పుతో...**

సాధారణంగా చలికాలం నుంచి ఎండకాలానికి, ఎండకాలం నుంచి వానకాలానికి మారిన సమయంలో జీబీఎస్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అయితే, ఇది ఎప్పుడైనా రావచ్చనే విషయం గుర్తుంచుకోవాలి. కాకపోతే రుతువు మారినప్పుడు వచ్చే ముప్పు అధికంగా ఉంటుంది. జీబీఎస్ రోగి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. నాడులు మన శరీర అవయవాలకు విద్యుత్ కనెక్షన్లలా పనిచేస్తాయి. ఒక్కసారి నాడులు దెబ్బతినగానే విద్యుత్ ప్రసారంలో అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా సంబంధిత అవయవాలు పనిచేయడం మానేస్తాయి.

**ఆటో ఇమ్యూన్ వల్ల...**

సాధారణంగా మనిషిలో ప్రతి అవయవాన్ని మెదడు నియంత్రిస్తుంది. మెదడు నుంచి శరీరంలో అన్ని భాగాలకూ నాడుల ద్వారా సమాచారం బదిలీ అవుతూ ఉంటుంది. ఈ కారణంగానే మనం పరిస్థితులకు అనుగుణంగా కాళ్లు, చేతులతోపాటు అన్ని అవయవాలనూ కదిలిస్తుంటాం. ఈ నాడులపై 'మైలిన్' అనే పొర ఉంటుంది. ఈ పొర ద్వారానే కదలికలకు సంబంధించిన సమాచారమంతా విద్యుత్ సిగ్నల్స్ ద్వారా వెళ్తూ, వస్తూ ఉంటుంది. వీటి ఆధారంగానే మన కండరాలు కదులుతుంటాయి. మైలిన్ ధ్వంసమైనప్పుడు విద్యుత్ సిగ్నల్స్ ఆగిపోతాయి. దీంతో నాడులు దెబ్బతిని అవయవాలు పనిచేయడం మానేస్తాయి.



**సకాలంలో చికిత్స**

**మైలిన్** పొర దెబ్బతినడంతో మొదటగా పొడవైన నాడులు దెబ్బతిని పని చేయడం మానేస్తాయి. అందుకే, ఈ రుగ్మత వచ్చిన వెంటనే పొడవుగా ఉండే కాలి నరాలు ప్రభావితం అవుతాయి. ఫలితంగా జీబీఎస్ సింగ్రోమ్‌లో మొట్టమొదట కాళ్లు చచ్చుబడిపోవడం కనిపిస్తుంది. ఆ తర్వాత అది క్రమంగా పైకి పాకుతున్నట్టుగా అనిపిస్తుంది. అంటే... వీపు, చేతులు, మెడ కండరాలు, చివరగా ముఖ కండరాలు ప్రభావితమవుతాయి. ఇలా రోగి శరీరం పూర్తిగా అచేతనమైపోతుంది. రెండుకాళ్లూ, రెండుచేతులూ చచ్చుబడిపోయినట్టుగా ఉంటాయి. అయినప్పటికీ రోగి శరీరంలో ప్రధాన అవయవాలన్నీ సక్రమంగానే పనిచేస్తుంటాయి. అయితే, బాగానే ఉన్నాం కదా అని వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఛాతీ కండరాలు, ఊపిరితిత్తులను పనిచేయించే డయాఫ్రమ్ కండరాలు కూడా ప్రభావితమవుతాయి. దాంతో ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. అప్పుడు వెంటిలేటర్ అవసరం పడుతుంది. దీంతోపాటు గొంతు కండరాలు సైతం ప్రభావితం కావడంతో మాట్లాడటం, మింగడం కష్టమైపోతాయి.

**వైరస్ దాడిచేస్తే!**

జీబీఎస్ ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. సాధారణంగా ప్రతీ వైరస్ చుట్టూ ప్రొటీన్లు ఉంటాయి. ఏదైనా వైరస్ ఎవరి శరీరంలోనైనా ప్రవేశించినప్పుడు రోగ నిరోధక వ్యవస్థ ప్రతిస్పందిస్తుంది. వైరస్‌పై ఉండే ప్రొటీన్లపై దాడిచేస్తుంది. ఆ వైరస్‌ను చంపేస్తుంది. ఈ క్రమంలో రోగ నిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) రోగి శరీరంలో నాడులపై ఉండే ప్రొటీన్లను వైరస్‌కు సంబంధించిన శత్రు ప్రొటీన్లుగా భావిస్తుంది. అలా వాటిపై దాడికి దిగుతుంది. దీనివల్ల నాడులపైన ఉండే 'మైలిన్' పొర దెబ్బతింటుంది. దాంతో ఈ విద్యుత్ సిగ్నళ్ల ప్రసారానికి అంతరాయం ఏర్పడుతుంది. కండరాలు తమ కదలికలను కోల్పోతాయి. ఫలితంగా రోగి అచేతనంగా మారిపోతాడు. కొన్నిచోట్ల నాడులపై మైలిన్ పొర ఉండదు. అలాంటి ప్రదేశంలో ఆటో ఇమ్యూన్ దాడి జరిగినప్పుడు వివిధ రకాల జీబీఎస్ వేరియంట్లు అభివృద్ధి చెందే ప్రమాదం ఉంటుంది.

**వ్యాధి లక్షణాలు**

- బలహీనత.
- చేతులతో వస్తువులు పట్టుకోలేకపోవడం.
- కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మొద్దుబారడం.
- మెడ, ముఖ కండరాలు బలహీనపడతాయి. ఆహారం నమలడం, కళ్లు తెరవడం ఇబ్బందిగా మారతాయి.
- ఊపిరి తీసుకోలేరు. ఆహారం మింగలేరు, మెడ కదపలేరు.
- లేచి నిల్చోలేరు.
- మలమూత్ర విసర్జన చేయలేకపోవడం.
- గుండె కొట్టుకునే రేటుతోపాటు రక్తపోటు కూడా పెరుగుతుంది.
- మూత్ర విసర్జనపై అదుపు కోల్పోతారు.
- తూలుతూ నడుస్తారు.

**అనర్థాలు**

- జీబీఎస్ తీవ్రమైతే శ్వాస సమస్య తలెత్తుతుంది. అప్పుడు మెకానికల్ వెంటిలేటర్ పెట్టాల్సి వస్తుంది.
- మెకానికల్ వెంటిలేటర్ వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.
- వెంటిలేటర్‌పై ఉండటం వల్ల కదలికలు లేక కాళ్లలో బ్లడ్ క్లాట్స్, గుండెపై దుష్ప్రభావం పడుతుంది.
- ఎక్కువకాలం బెడ్‌పై ఉండటం వల్ల చర్మంపై పుండ్లు ఏర్పడతాయి.
- ఇన్ఫెక్షన్లు ఎక్కువవడం వల్ల సెప్సిస్ వచ్చి ప్రాణాంతకంగా మారుతుంది. ఇన్ఫెక్షన్ రక్తంలోకీ వచ్చేస్తుంది.
- అటానమిక్ నర్వస్ సిస్టం (స్వయం చాలక నాడీ వ్యవస్థ) పైనా ప్రభావం పడుతుంది. దీనివల్ల గుండె పనితీరు, బీపీలో హెచ్చుతగ్గులు ఉంటాయి.

**నిర్ధారణ పద్ధతులు**

తొలుత సాధారణ రక్తపరీక్ష చేసి అందులో పొటాషియం, కాల్షియం స్థాయులను, క్రియాటినిన్ స్థాయిని పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే నర్వ్ కండక్షన్ పరీక్షల ద్వారా జీబీఎస్‌ను నిర్ధారణ చేస్తారు. అయితే, ఈ పరీక్ష ద్వారా వ్యాధి తీవ్రతను కచ్చితంగా చెప్పలేం. కొన్నిసార్లు వెన్ను నుంచి నీరు తీసి చేసే సెరెబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ (సీఎస్ఎఫ్) పరీక్ష కూడా అవసరం కావచ్చు. రోగ లక్షణాల ఆధారంగా క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు.



**నర్వ్ కండక్షన్ స్టడీ**

దీనిలో రోగి నాడులపై విద్యుత్ ప్రసారం చేస్తారు. ఈ పరీక్షలో నాడుల పనితీరు తెలుసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో ఈ పద్ధతిలో సమస్యను సరిగ్గా నిర్ధారించలేం. అందువల్ల లక్షణాల ఆధారంగా చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది.

**ఇమ్యునోగ్లోబ్యులిన్ చికిత్స**

శరీరం బరువు ఆధారంగా మోతాదు నిర్ణయించి ఐదు రోజులపాటు ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్లను ఇవ్వడం ఒక రకమైన చికిత్స. ఇవి శరీరంలోని యాంటీబాడీస్ మనకు వ్యతిరేకంగా పనిచేయకుండా అడ్డుకుంటాయి. అంటే యాంటీబాడీస్‌ను బ్లాక్ చేస్తాయి. తద్వారా నాడుల మీద ఉండే మైలిన్ పొర మరింత ధ్వంసం కాకుండా నివారిస్తాయి.

... మహేశ్వర్‌రావు బండారి



**డాక్టర్ రాజారావు**
జనరల్ ఫిజీషియన్, సూపరింటెండెంట్
యాదాద్రి–భువనగిరి ప్రభుత్వ దవాఖాన

